మహిళలకు రూ. 1500 ఇవ్వాలి



కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఎన్నికల సమయంలో హోరెత్తించారు.పేద కుటుంబంలోని మహిళకు ప్రతి నెలా రూ. 1500 వస్తాయంటే మంచి పథకం అని నమ్మాం. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పథకాలపై నోరు మెదపడంలేదు. పింఛన్ హామీ తప్పా ఇప్పటికీ మిగిలిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికైనా మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇవ్వాలి. అధికారం వచ్చి వంద రోజులు కావస్తోంది. ఒక వేళ పింఛన్ల నగదు కలిపి ఇచ్చినట్లు అది కూడా కలిపి ఇస్తారో స్పష్టం చేయాలి.

– మహేశ్వరి, 63వ వార్డు, క్రాంతినగర్

పిల్లల డబ్బుల కోసం ఎదురుచూపులు



చదువుకునే ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15000 తల్లికి వందనం పేరుతో అంది స్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారు. దీంతో మా ఇద్దరు పిల్లలకు రూ.15000 చొప్పున ఏడాదికి రూ.30 వేలు అందుతాయని సంతోషించాం. కానీ ఈ ఏడాది తల్లికివందనం ఊసే లేదు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై పిల్లల పుస్తకాలు, స్కూల్ ఫీజులకు అప్పు చేసి మరీ వేల రూపాయలు ఖర్చు చేశాం. గతంలో అమ్మ ఒడి పథకం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందించారు. కానీ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలుపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ తల్లికి వందనం పథకం అమలు చేయాలి.

– కామొజుల పార్వతి, 40వ వార్డు

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వందరోజులు కావస్తున్నా ఇంత వరకూ ఒక పథకం అమలు చేయలేదు. ఫీజుల భారంతో ఇబ్బంది పడుతున్నాం. గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు అనుగుణంగా నవరత్న పథకాలు అమలు చేసి చూపించారు. అదే మాదిరిగా కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి.

– మంగవేణి, మల్కాపురం

అధికారంలోకి వచ్చి వంద రోజులైనా..



ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ. 15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. పిల్లలను చదివించుకోవడానికి ఇబ్బంది ఉండదని సంబర పడ్డాం. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అవుతోంది. నేటికీ ఆ హామీ అమలు కాలేదు. మంత్రి లోకేశ్ ఇంకా చర్చిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. మాకు బాబు ఉన్నాడు. మా అక్కకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.వారందరికీ రూ. 15 వేల చొప్పున రూ.45 వేల వస్తాయని ఆశించాం. మరి ఈ ఏడాది ఫీజులు సంగతేంటి.?


– మౌనికాదేవి, శ్రీహరిపురం

మహిళలకు సాయం ఎప్పుడిస్తారో..



మహిళలకు ప్రతీ నెలా రూ.1500లు ఇస్తామని చెబితే మా ఇంట్లోవాళ్లతో పాటు కాలనీ వాళ్లంతా ఎంతో సంబర పడ్డాం. ఎన్నికల్లో మద్దతుగా నిలిచాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక ప్రతి నెలా చేతికి డబ్బులు అందుతాయని అనుకున్నాం. కానీ ఆ డబ్బులు ఎప్పుడిస్తారా అని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు వెంటనే ప్రతీ నెలా రూ.1500 ఇవ్వాలి. లేకుంటే మహిళలను అగౌరవ పరిచినట్లే.

– లక్కవరపు అనూష, లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని 2024 ఎన్నికల ప్రచారంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు చేసిన పోస్ట్

నమ్మి ఓట్లేశాం... నట్టేట ముంచొద్దు బాబూ...

హామీలన్నీ అమలు చేయండి

నీకు రూ.15 వేలు... నీకు రూ.15 వేలు.. నీకు.. నీకు... ఇంటిలో ఎందరు పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున అందజేస్తాం.. అమ్మకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలోనే వేసేస్తాం... మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం... మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కలిస్తాం... చదువుకున్న నిరుద్యోగులుంటే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తాం.. అంటూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఊదరగొట్టారు. కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోసహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు.. ఆ హామీలన్నీ జనం నమ్మి ఓట్లేసి అధికారం కట్టబెట్టారు. అధికారం చేపట్టి వంద రోజులు కావస్తున్నా పథకాలు అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేసి ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. బాబు ష్యూరిటీకి గ్యారంటీ లేదని ప్రజలు వాపోతున్నారు. కాలయాపన చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– గోపాలపట్నం/ మల్కాపురం/ సింధియా/విశాఖ విద్య

ప్రతి మహిళలకు నెలకు రూ.1500 (బాబు సూపర్ 6)



అర్హులు 87,500
నెలకు ఇవ్వాల్సిన మొత్తం
రూ.13.12 కోట్లు

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు (బాబు సూపర్ 6)



ఉచిత గ్యాస్ సిలిండర్లు అర్హులు
39,513
ఏడాదికి ఇవ్వాల్సిన మొత్తం
రూ.31,91,85,300

ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం (బాబు సూపర్ 6)



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం
అర్హులు : 90,345
అందాల్సిన మొత్తం
రూ. 135.52 కోట్లు

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి (బాబు సూపర్ 6)



నిరుద్యోగభృతి అర్హులు :
8000
నెలకు ఇవ్వాల్సిన మొత్తం
రూ. 2,40,000

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (బాబు సూపర్ 6)



ఉచిత బస్సు ప్రయాణం అర్హులు
1,48,266

'తల్లికి వందనం' ఏదీ?



మా పిల్లలిద్దరూ ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. పెద్దోడు ప్రేమ్ కుమార్ 8వ తరగతి, చిన్నోడు తరుణ్ ఆరోతరగతి చదువుతున్నాడు. మా ఆయన ఆటో అద్దెకు తీసుకొని నడుపుతాడు. నేను ఇంటి అవసరాలకు కోసం నేను మిషన్ కుడతాను. తరుణ్ పేరు మీద మాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అమ్మ ఒడి డబ్బులు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.15000లు చొప్పున వచ్చాయి.దీంతో ఫీజులు భారం తగ్గింది. కూటమి ప్రభుత్వం వస్తే తల్లికి వందనం పేరిట బడికి వెళుతున్న పిల్లలందరికీ రూ. 15000 వేలు ఇస్తామని చెప్పారు.దీంతో ఎంతో సంతోషించాం. ఈఏడాది పథకం అమలుపై క్లారిటీ లేదు. ఇంత వరకూ ఆ హామీ జాడలేదు. వెంటనేఅమలు చేస్తే మాలాంటి వాళ్లకు ఇబ్బందులు తప్పుతాయి.

– బి. మణి, గవర వీధి

సిలిండర్లు అందించేందుకూ కాలయాపనే!



ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. సిలిండర్లు వస్తే గ్యాస్ భారం తగ్గుతుందని ఆశించాం. ఇప్పటికీ మార్గదర్శకాలు విడుదల చేయలేదు.తక్షణమే క్లారిటీ ఇచ్చి ఎటువంటి కొర్రీలు లేకుండా ఆ హామీ అమలు చేయాలి..

– బి. సరోజని, కొత్తపాలెం

'తల్లికి వందనం' ఇంకా రాలేదు



తల్లికి వందనం ఇంకా రాలేదు. ఎప్పుడు వేస్తారో తెలియడం లేదు. గత ప్రభుత్వం అమ్మ ఒడి సకాలంలో ఇచ్చేసేది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు ఉన్నా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. కానీ ఇంత వరకు ఒక్కరికి కూడా రాలేదు. ఆ డబ్బులు వస్తే మేలు జరుగుతుందని ఎదురు చూస్తున్నాం. ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– సీహెచ్ హారతి, గోపాలపట్నం

ఉచిత బస్సు విధివిధానాలేవి?



టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని మహిళలంతా సంతోషించాం . వారికి మద్దతు తెలిపాం. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ఉచిత బస్సు ప్రయాణం మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఏ బస్సులో ప్రయాణం కల్పిస్తారు.. ఎవరికి కల్పిస్తారో తక్షణమే వెల్లడించాలి.

– చోడవరపు రాజేశ్వరి, బుచ్చిరాజుపాలెం

అలేఖ్యకు అభినందన



అలేఖ్యను అభినందిస్తున్న బాక్సింగ్ కోచ్‌లు

మల్కాపురం: పంజాబ్‌లో ఇటీవల జరిగిన జూనియర్ బాక్సింగ్ (బాలికల విభాగం) పోటీల్లో ప్రతిభ చూపిన అలేఖ్యను బాక్సింగ్ కోచ్‌లు బుధవారం అభినందించారు. మల్కాపురం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కోచ్‌లు హరి,రమణ ఆమె సాధించిన గోల్డు మెడల్‌ను మెడలో వేసి సత్కరించారు. 40 నుంచి 42 కిలోల విభాగంలో అలేఖ్య గోల్డు మెడల్ సాధించిందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్ సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం 4వ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె. ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 లోగా ఐటీఐ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 28న నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

దర్జాగా అనధికార నిర్మాణాలు!

- కన్నెత్తి చూడని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కాసులు ఇస్తే సరి.. లేదంటే హరే



గాంధీజీవీధిలో అనధికార నిర్మాణం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వీటి గురించి ఆయా ప్రాంతాల సచివాలయాల టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టిలో ఉన్నా వారు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో అనధికార నిర్మాణాలకు అడ్డు లేకుండా పోతుంది. భవనాల యజమానులతో టౌన్‌ప్లానింగ్ అధికారులు రహస్య ఒప్పందాలు చేసుకోవడం వల్లే వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిర్మాణాలు ఇలా..

59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ సచివాలయం పరిధిలో ఓ వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నాడు. ఈ వ్యక్తి ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతి కన్నా అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నాడు. ఈ భవనానికి సెట్‌బ్యాక్స్ కూడా లేకపోవడం విశేషం.

- 61వ వార్డు గాంధీజీవీధి సచివాలయం పరిధిలో మూడు సూతుల వద్ద ఓ వ్యక్తి బహుళ అంతస్తు నిర్మాణం చేపడుతున్నారు. ఈ భవన యజమాని సచివాలయ టౌన్ ప్లానింగ్ (ఇన్‌చార్జి బాధ్యతలు) సెక్రటరీ బంధువు కావడంతో నిర్మాణం చకచకా సాగిపోతుంది. అలాగే మల్కాపురం మార్కెట్ వీధి వద్ద, కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ వెనుక మార్గంలో మూడు అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జోన్-5 కమిషనర్,టౌన్‌ప్లానింగ్ అధికారులు పక్కాగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ సచివాలయం పరిధిలో..

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మమత

గోపాలపట్నం: మాదక ద్రవ్యాల జోలికి వెళితే భవిష్యత్తు అంధకారమవుతుందని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మమత అన్నారు. బుచ్చిరాజుపాలెంలోని భాష్యం పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై రైల్వే పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు గురి కావద్దని చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. సమాజానికి మేలు చేసే విధంగా మన జీవితాలు ఉండాలన్నారు. ఆకతాయిలతో కలసి రైళ్లపై రాళ్లు విసరడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. అపరచిత వ్యక్తులు చూపిన ప్రలోభాలకు లొంగ వద్దని సూచించారు. రైల్వే హెల్ప్ లైన్ 139 గురించి ఆమె వివరించారు.

స్టోర్ అద్దె వసూలు చేయాలని డిమాండ్



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు

గోపాలపట్నం : ఎన్‌ఏడీ సీఈ యూనియన్ నిర్వహిస్తున్న ఎన్‌ఏడీ సివిల్ యూనియన్ మ్యూచువల్ ఎయిడెడ్ కన్స్యూమర్స్ స్టోర్‌కు సంబంధించిన షాపుల అద్దె వసూలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌సీఈ అండ్ డబ్ల్యూ యూనియన్ సభ్యులు మెయిన్ గేటు వద్ద బుధవారం నిరశన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్‌ఏడీ మేనేజ్‌మెంట్ అండర్‌లో ఉన్న ఎన్‌ఏడీ సివిల్ యూనియన్ ఎంప్లాయీస్ మ్యూచువల్ ఎయిడెడ్ కన్స్యూమర్స్ స్టోర్ దుకాణాల అద్దె 2021 నుంచి ఇప్పటి వరకూ వసూలు చేయలేదన్నారు. ఉద్యోగుల నుంచి ప్రతీ పైసా వదలకుండా వసూలు చేసే యాజమాన్యం, వీరిపై అంత ఔదార్యం ఎందుకు చూపిస్తోందని ప్రశ్నించారు. అంతేకాకుండా ఇందులో డైరెక్టర్లకు ప్రత్యేక పాస్‌లు ఇచ్చి స్టోర్‌లోని సామగ్రిని బయటకు తీసుకెళ్లి వ్యాపారాలు చేయిస్తున్నారని విమర్శించారు. సీఈ యూనియన్ మేనేజ్‌మెంట్‌తో కుమ్మక్కై ఉద్యోగుల హక్కులు కాలరాస్తోందని దుయ్యబట్టారు. యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

విశేషంగా అన్నసమారాధన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు లేబర్ జంక్షన్‌లో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ప్రారంభించారు. వందలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

వ్యాధి నిర్ధారణలో మైక్రో బయాలజీ కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మల్కాపురం: అంతర్జాతీయ సూక్ష్మ జీవశాస్త్రం దినోత్సవం సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో బుధవారం కళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు మైక్రోబయాలజీ ల్యాబ్‌లో జరిగే వివిధ ప్రాక్టికల్స్ , మైక్రోస్కోపిక్ అబ్జర్వేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి,డాక్టర్ సీహెచ్ ప్రశాంతి పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో విత్తన బంతులు



విత్తన బంతులతో విద్యార్థులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం : చిట్టి చేతుల్లో విత్తన బంతులు రూపుదిద్దుకున్నాయి. పలు రకాల విత్తనాలను మట్టిలో కలిపి విత్తనాలు తయారు చేశారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విత్తనాల బంతులు బుధవారం తయారు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీఎస్ఈ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.